ఎల్లారెడ్డిపేట: అలుగుపారుతున్న గిద్ద చెరువు

కోనరావుపేట: మామిడిపల్లి మూలవాగులో ధ్వంసమైన లోలెవల్ వంతెన

బోయినపల్లి: మత్తడి దుంకుతున్న విలాసాగర్ చెరువు

వదలని వాన

జిల్లాను వర్షం వదలడం లేదు. రెండోరోజు సోమవారం సైతం జిల్లావ్యాప్తంగా భారీ వర్షం పడింది. నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టుతోపాటు పలు గ్రామాల్లోని చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. వరద ఉధృతికి వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోలెవల్ వంతెనల వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్‌తోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

- రాజన్నసిరిసిల్ల, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ)

- రెండోరోజు జిల్లావ్యాప్తంగా వర్షం
- మత్తడి దుంకుతున్న ఎగువమానేరు, చెరువులు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- జిల్లాలో పర్యటించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- సహాయక చర్యలు ముమ్మరం

గంభీరావుపేట: మత్తడి దుంకుతున్న ఎగువ మానేరు ప్రాజెక్టు

గంభీరావుపేట/ముస్తాబాద్/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి, సెప్టెంబర్ 2: గంభీరావుపేట మండలం నర్మాలలోని ఎగువమానేరు ప్రాజెక్టుతోపాటు చెరువులు నిండుకుని మత్తళ్లు దుంకుతున్నాయి. ఎగువమానేరు మత్తడి దుంకడంతో దిగువన మానేరు వాగులు రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్నాయి. గంభీరావుపేట-లింగన్నపేట, కోళ్లమద్ది, కొత్తపల్లి, శ్రీగాధ, ముచ్చర్ల గ్రామాల మధ్య రెండు రోజుల నుంచి రాకపోకలు స్తంభించిపోయాయి. గోరంటాల వాగు నుంచి సింగసముద్రంలోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. అలాగే ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువు మత్తడి దుంకుతున్నది. వర్షాలకు కూలిన తొమ్మిది ఇండ్లను తహసీల్దార్ రాంచందర్ పరిశీలించి, వివరాలు సేకరించారు. కొందరికి బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. బోయినపల్లి మండలం విలాసాగర్ పెద్ద చెరువుతోపాటు కోరెం కిష్టమ్మ చెరువు, కోరెం మంట్లకుంట చెరువు నిండి మత్తళ్లు దుంకడంతో రైతుల్లో సంతోషం నెలకొన్నది. కోరెం, విలాసాగర్, అనంతపల్లి గ్రామాల్లో మత్తడి దుంకుతున్న చెరువులను నీటి పారుదలశాఖ అధికారులతో కలిసి తహసీల్దార్ పుష్పలత పరిశీలించారు. బూర్గుపల్లిలో కూలిన ఇంటిని పరిశీలించారు. ఆమె వెంట ఆర్ఐ ప్రభాకర్, బాలయ్య, కార్యదర్శి రవి ఉన్నారు. ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో ముస్తాబాద్-ఎల్లారెడ్డిపేట మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలో పెద్ద చెరువును ఇరిగేషన్ డీఈ రవికుమార్ సందర్శించారు. వర్షాలతో ఆయా గ్రామాల్లో పిట్ల శోభ, మరిపల్లి నర్సయ్య, షేక్‌షానూర్, బాలయ్య ఇండ్లు ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలైన వెంకంపేట, సర్దార్‌నగర్, అశోక్‌నగర్, నేతన్న చౌక్, సంజీవయ్య నగర్, శాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో వరద నీరు వెళ్లేందుకు నామమాత్రపు చర్యలే తీసుకుంటున్నారని విమర్శలు చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధ్వంసమైన రోడ్లు, వంతెనలు, ఇండ్లు

కోనరావుపేట మండలం సిరికొండ నుంచి సిరిసిల్లకు వెళ్లేందుకు ప్రధాన రోడ్డు నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు వద్ద కోతకు గురైంది. అలాగే వట్టిమల్ల, నిమ్మపల్లి, బావుసాయిపేట, వెంకట్రావుపేట, మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల మధ్యలోని మూలవాగులో లోలెవల్ బ్రిడ్జిలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మామిడిపల్లి గ్రామంలో కులేరు పోచవ్వ అనే వృద్ధురాలికి చెందిన పెంకుటిల్లు గోడలు కూలిపోయాయి. ఆ సమయంలో వృద్ధురాలు ఇంటి బయట ఉండడంతో ప్రమాదం తప్పింది. జీపీ కార్యదర్శి ముదాం సతీశ్ కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. వృద్ధురాలికి మరో ఇంటిలో స్థావరం కల్పించారు. అలాగే గ్రామంలో మూలవాగు ఒడ్డున నిర్మించిన స్మశానవాటిక పాక్షికంగా ధ్వంసమైంది.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్, ఎస్పీ

ఇల్లంతకుంట/గంభీరావుపేట/వీర్నపల్లి, సెప్టెంబర్ 2: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. సోమవారం వారు ఇల్లంతకుంట మండలం జవారుపేట- నర్సక్కపేట గ్రామాల మధ్య బిక్కవాగులో కొట్టుకుపోయిన రోడ్డు, కందికట్కూర్‌లోని లోలెవల్ బ్రిడ్జి, గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు, వీర్నపల్లి మండలం గర్జనపల్లి, సీతారాంనాయక్‌తండాలో లో లెవల్ కల్వర్టు, మూల వాగును పరిశీలించారు. మత్తడి దుంకుతున్న వరద, ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో గురించి ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు సందర్శనకు పర్యాటకులు రాకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. అనంతరం లింగన్నపేట మానేరువాగు ఉధృతిని పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గర్జనపల్లిలో కూలిపోయిన మల్యాల పూజిత ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని సూచించారు. భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్లకు వెంటనే అంచనా వేసి మరమ్మతులు జరిగేలా చూడాలని ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో రమేశ్, డీఎస్పీ చంద్రశేఖర్, తహసీల్దార్లు ఫారుక్, మారుతిరెడ్డి, భూపతి, ఎంపీడీవోలు శశికళ, రాజేందర్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, ఎస్ఐ రామ్మోహన్,పీఏసీఎస్ డైరెక్టర్ మల్యాల రాజవీర్, నాయకులు హమీద్, గంట అశోక్, రెడ్డబోయిన గోపి, ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: నబిక్కవాగును పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బోయినపల్లి: కోరెం చెరువు వద్ద మాట్లాడుతున్న తహసీల్దార్ పుష్పలత

పొలాల అమావాస్య సందడి

కోనరావుపేట, సెప్టెంబర్ 2: మంగళ్లపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో ఎడ్ల పొలాల అమవాస్యను ఘనంగా నిర్వహించారు. ఆరె క్షేత్రియ కులస్తులకు అత్యంత విశిష్టితతో కూడిన ఈ పండుగ ఘనంగా జరుపుకొన్నారు. వ్యవసాయంలోని ప్రతి పనికి చేదోడుగా ఉండే ఎద్దులను దైవంగా భావించి.. ఉదయాన్నే వాటికి సమీపంలోని చెరువులు, కుంటలలో శుభ్రంగా స్నానం చేయించారు. అనంతరం ఇంటికి తీసుకెళ్లి అందంగా ముస్తాబు చేశారు. పిండి వంటలను వాటికి తినిపించి కుటుంబ సమేతంగా భక్తితో పూజించారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

రెండు పంపుల ద్వారా ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్న మోటార్లు

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 2: అన్నపూర్ణ ప్రాజెక్టుకు సోమవారం బహుబలి మోటార్ల ద్వారా రోజుకు 6,440 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నట్టు ఏఈ సమరసేన తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా తిప్పాపూర్ పంప్‌హౌస్‌లోకి గోదావరి జలాలు రాగా, బహుబలి మోటార్ల ద్వారా అన్నపూర్ణలోకి ఎత్తిపోస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టులో 3.07టీఎంసీలు నిల్వ ఉండగా, సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్‌కు 6,600 కూసెక్కుల నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా విడుదల చేశామని తెలిపారు.

మిడ్‌మానేరు @ 19.78టీఎంసీలు

బోయినపల్లి, ఆగస్టు 2: శ్రీ రాజరాజేశ్వర జలాశయంలో 27.54 టీఎంసీలకు గానూ 19.78 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా 52,383 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతోపాటు వేములవాడ మూలవాగు నుంచి, వరద కాలువ ద్వారా ప్రాజెక్టుకు వరద వస్తున్నదని తెలిపారు. దిగువన ఉన్న ఎల్ఎండీకి 6,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు.

'బెస్ట్ అవైలబుల్'లో ప్రవేశాలకు ఆహ్వానం

కలెక్టరేట్, సెప్టెంబర్ 2: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ (రెసిడెన్షియల్)లో 2024 -25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతికి 49 సీట్లు కేటాయించామని, ప్రవేశం పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంటుందన్నారు. ఈ నెల 16లోగా సంబంధిత దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ నెల 24న విద్యార్థుల సమక్షంలో డ్రా తీస్తామని వెల్లడించారు.

బధిర విద్యార్థిని ఉన్నత చదువుకు హామీ

- భరోసానిచ్చిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు

చిన్నారి తల్లితో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వీర్నపల్లి, సెప్టెంబర్2: బధిర విద్యార్థిని విద్యాభ్యాసానికి హామీ ఇచ్చి కలెక్టర్ మానవత్వం చాటుకున్నారు. గర్జనపల్లికి చెందిన మూగ, చెవిటి బాలిక దొమకొండ లహరి రేకుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నది. ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్మీడియట్ చదవలేక ఇంటి వద్దనే ఉంటున్నది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు సోమవారం గర్జనపల్లికి వచ్చిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ బాలిక ఇంటర్ చదవడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డిని అదేశించారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదే గ్రామానికి చెందిన గడ్డం మహిర అనే చిన్నారి నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, వైద్య చికిత్స సాయం చేయాలని తల్లి పూజిత కలెక్టర్‌ను వేడుకున్నది. స్పందించిన ఆయన చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆయన వెంట ఎస్పీ అఖిల్‌మహాజన్, అధికారులు ఉన్నారు.

పశువులను మేతకు తీసుకెళ్లి..

- గిరిజన మహిళ మృతి

లక్ష్మి (ఫైల్)

వీర్నపల్లి, సెప్టెంబర్2: పశువులను మేతకు తీసుకెళ్లి మహిళ కాలుకు తాడు బిగుసుకొని అక్కడికక్కడే మృతిచెందిన ఘటన లోద్దితండాలో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మాలోత్ లక్ష్మి (48) తమకున్న గేదెలను రోజువారి మాదిరిగా మేతకు తీసుకెళ్లింది. మేపుతున్న క్రమంలో ఓ గేదెకు ఉన్న తాడు లక్ష్మి కాలుకి చుట్టుకున్నది. వెంటనే గేదె తాడును లాగేయడంతో లక్ష్మి ఒక్కసారి కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు గమనించి దవాఖానకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మికి భర్తతోపాటు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ

స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

వేములవాడ, సెప్టెంబర్ 2: పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఏంజెల సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, లింగ నిర్ధారణ జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దవాఖానలోని పలు రికార్డులను పరిశీలించారు. ఇక్కడ హెచ్ఈ బాలయ్య, సీహెచ్‌వో బాలచందర్ ఉన్నారు.

కుక్కల దాడిలో గాయాలు

కోనరావుపేట, సెప్టెంబర్ 2: కనగర్తి గ్రామంలో ఓదెల రమ్య, మోకాళ్ల లచ్చిరెడ్డిపై పిచ్చికుక్క దాడి చేసింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు దవాఖానకు తరలించారు. అలాగే లింగంపెల్లి రవి అనే రైతుకు చెందిన దూడపై కూడా కుక్క దాడి చేసింది. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరద నీటి మళ్లింపునకు చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- క్షేత్రస్థాయిలో లోతట్టు ప్రాంతాల పరిశీలన

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 2: సిరిసిల్ల పట్టణంలోకి చేరుతున్న వరద నీటిని మళ్లించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌తోపాటు లోతట్టు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పద్మనగర్‌లోని వరద కాలువను పరిశీలించి, వరద ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీల్టు తొలగింపు, తదితర పనులను చేపట్టాలన్నారు. పట్టణంలోకి వరద చేరితే.. తక్షణ మార్గంగా బైపాస్ రోడ్డులోని 9వ ప్యాకేజీ ద్వారా నీటి మళ్లింపునకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కమిషనర్, అధికారులు ఉన్నారు.

పట్టణంలోని పద్మనగర్‌లో వరద నీటి కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పలు గ్రామాల్లో పర్యటన
- బాధితులను ఆదుకుంటామని హామీ

చందుర్తి: మర్రిగడ్డలో నేరెళ్ల సరోజ ఇంటిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి సెప్టెంబర్ 2: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులు అధైర్యపడొద్దు.. ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భరోసానిచ్చారు. చందుర్తి మండలం మర్రిగడ్డలో నేరెళ్ల సరోజన, మల్యాల రాజేశం ఇండ్లు కూలిపోగా.. సోమవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీఇచ్చారు. అనంతరం లింగంపేటలో మత్తడి దుంకిన గురునాథం చెరువు వరద ఉధృతిని, సనుగులలో కోతకు గురైన రోడ్డు, పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలను తాకవద్దని సూచించారు. చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని.. పురాతన ఇండ్లల్లో ఎవరూ ఉండవద్దన్నారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు, తదితరులు ఉన్నారు.

సంతోష్ పార్థివదేహానికి నివాళి

వేములవాడ, సెప్టెంబర్2: క్యాన్సర్‌తో మృతిచెందిన వడ్లకొండ సంతోష్ పార్థివ దేహానికి సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేశ్, తోట రాజు, అబ్దుల్ రజాక్, మస్తాన్, వస్తాద్ కృష్ణ, నాగభూషణం, కొండ శేఖర్, ముంజ ఉమేందర్, రాజు ఉన్నారు.

ఎల్లవ్వకు ₹50వేల తక్షణసాయం

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 2: భారీ వర్షాలకు మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో ఎల్లవ్వకు ఇల్లు కూలిపోయింది. ఈ క్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం వృద్ధురాలి ఇంటిని పరిశీలించి.. తక్షణ సాయంగా ₹50వేలు అందించారు. ఇక్కడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేశ్, వైస్ చైర్మన్ మహేశ్, కౌన్సిలర్ శంకర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

వేములవాడ రూరల్: ఎల్లవ్వకు చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చిగురిస్తున్న ఆశలు

మొక్కలతో కళకళలాడుతున్న పత్తి చేను

ఈ ఏడాది ఆరంభంలో పత్తి పంటకు అనుకూలంగా వర్షం కురవడంతో మొక్కలు ఆశాజనకంగా మొలకెత్తాయి. ఇటీవల వర్షం ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో చేనులో నీరు నిల్వడంతో పత్తి మొక్కలు ఎర్రబారి వాలిపోయాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. దీంతో రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- కోనరావుపేట, సెప్టెంబర్ 2

ఆరోగ్య కేంద్రం సందర్శన

గంభీరావుపేట, సెప్టెంబర్ 2: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యాధికారి వసంత్‌రావు, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ పెంచల య్య సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాల సంఖ్య, ఐపీ, ఓపీ రోగుల సంఖ్య వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ సూపరింటెండెంట్ సృజన్, వైద్యాధికారులు సింధూజ, సుష్మ, తదితరులు ఉన్నారు.

అంతర్గత బదిలీ

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 2: రాజన్న ఆలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వరి నర్సయ్యను ఆలయ పర్యవేక్షకుడిగా అంతర్గత బదిలీ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. వారం రోజుల్లో ఆలయంలో అంతర్గత బదిలీలు ఉండనున్నట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట, సెప్టెంబర్ 2: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియమాకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్-1, కామర్స్-2, ఇంగ్లిష్-1, తెలుగు-2 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 4లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చర్యలు తీసుకోవాలి

గంభీరావుపేట, సెప్టెంబర్ 2: లింగన్నపేట గ్రామంలోని లోలెవల్ వంతెనను అక్రమంగా కూలగొట్టిన కాంట్రాక్టరుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. లింగన్నపేట మానేరు వాగును సోమవారం ఆయన సందర్శించి, మాట్లాడారు. రూ.13కోట్లతో మంజూరైన హైలెవల్ వంతెనను నిర్మాణం చేయకుండానే.. పాత లోలెవల్ వంతెనను కూలగొట్టి ఇనుప సలాకను అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరదతో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర ఉధృతి తగ్గిన వెంటనే ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పార్టీ మండలాధ్యక్షుడు గంట అశోక్, నాయకులు, తదితరులు ఉన్నారు.

పోషకాహార వారోత్సవాలు

వారోత్సవాల్లో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

చందుర్తి, సెప్టెంబర్ 2: లింగంపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం లింగంపేట గ్రామంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ పోషకాహార వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు నెలసరి సమావేశాన్ని నిర్వహించి, ప్రగతి నివేదికలను పరిశీలించారు.

రాజన్న ఆలయంలో రద్దీ

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 2: శ్రావణ చివరి సోమవారం కావడంతో వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో రద్దీగా కనిపించింది. అమావాస్య అయినప్పటికీ భక్తులు వేకువజాము ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను దాదాపు 8వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు.

రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తులు

NOTICE
IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT SIRCILLA
S.O.P.No. 06 of 2024
Between:
Gaddam Bhoomaiah ...Petitioner
And
Employees Provident Fund Organisation R/by its Asst. Provident Fund Commissioner (Regional Office), Bhavishya Nidhi Bhavan, 341, Service Road, Bandra East, Mumbai, Maharastra State-400051 & others
To, ...Respondents.
To whomsoever it may concern
Take notice that the petitioner has filed the above petition for grant of succession certificate in his favour declaring that the petitioner is entitled to receive his 1/3rd share amount in P.F. amount Rs. 1,06,757/- and other benefits accrued thereon P.F. account No. MH/BAN/45665/1252429 UAN: 100859347584 from the respondent no. 1 i.e. the office of Asst. P.F. Commissioner, Regional Office, Mumbai and the above O.P. is posted on: 26-09-2024 at 10-30 A.M. for your appearance.
So, those who are interested to claim the said amount, he/she/they may appear before this court on the 26 day of September, 2024 at 10-30 A.M. and file objections if any, otherwise, the above petition will be heard and determined as per law.
// By order of the court //
Sd/- KODAM SATYANARAYANA, Advocate, Sircilla. Cell: 93969 11441.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217
PLOTS FOR SALE
★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-000
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189